ప్రజాశక్తి

సోమవారం 17 జూన్ 2024 5 విజయనగరం



చెస్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

చదరంగం అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక లార్వెన్స్ పాఠశాలలో ఆదివారం జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక పోటీల్లో బాలికల విభాగంలో కె.నితీష జి.ఖ్యాతిశ్రీ, ఎ.వీణామృత, కె.లిఖితశ్రీ, బాలుర విభాగంలో ఎం.కృష్ణసాయి సూరజ్, ఎం.లిఖిత్, కె.ప్రహ్లాద్, జి.చరణ్ ఎంపికయ్యారు. జులై 18, 19 తేదీలలో నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీలో వీరు పాల్గొనున్నారు. ఎంపిక పోటీలకు న్యాయవాది తాడి రాజు, చదరంగం అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.వి జ్వాలాముఖి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా పద్మ, సునీత, అర్చన వ్యవహరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యేలు అదితి, బేబినాయన


యువతలో స్కిల్స్‌ను గుర్తించేలా
నైపుణ్య సూచికలు

- పరిశ్రమల ఏర్పాటులో సహాయ పడేందుకు వేదిక ఏర్పాటు
- చిన్న పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఘన స్వాగతం పలికిన అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్రంలో యువతలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, ఏ తరహా స్కిల్ కలిగిన వారు ఏ ప్రాంతంలో ఎంత సంఖ్యలో అందుబాటులో ఉన్నారో తెలిపేలా నైపుణ్య సూచికలను రూపొందించనున్నట్టు చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. దీనివల్ల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత గల మానవ వనరులు ఎక్కడ అందుబాటులో ఉన్నదీ తెలుసుకొంటారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జిల్లాకు తొలిసారిగా ఆదివారం విచ్చేసిన శ్రీనివాస్‌కు జిల్లా అధికారులు, టిడిపి, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నగరంలో అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయనగరం, బొబ్బిలి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, బేబినాయనతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని యువతలో నైపుణ్యాలను పెంపొందించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఉద్యోగ కల్పనపైనే అధికంగా దృష్టిసారిస్తామన్నారు. గత ఐదేళ్లలో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని, ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పరిస్థితులు కల్పించలేదని చెప్పారు. ఏ జిల్లా ఎలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందో పారిశ్రామిక వేత్తలకు తెలియజేసి, ఆయా జిల్లాలో ఆ తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తామని వెల్లడించారు. విజయనగరంలోనూ ఏ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయో గుర్తిస్తామన్నారు. ఔత్సాహికులకు అవసరమైన సమాచారాన్ని, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, ఇతర సలహాలు అందజేసి వారు పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో తగిన సహకారం అందించేందుకు ఒక వేదిక ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చిన్నపరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలు, వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా వేదిక ద్వారా సహకారం అందిస్తామన్నారు. అంతా సమిష్టిగా పనిచేసి జిల్లాను, రాష్ట్రాన్ని ఒక దారిలో పెట్టాల్సి ఉందన్నారు. విదేశాల్లోని ఆంధ్రుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారితో ఇక్కడ పెట్టుబడులు పెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు.



పైడితల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్ దంపతులు

కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండబాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జొన్నవలస ఎంపిటిసి రాజేష్‌బాబు, టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కంది మురళి నాయుడు, పిల్లా విజయ్, అవనాపు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

ప్రజాశక్తి-భోగాపురం, గంట్యాడ, గజపతినగరం

మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి జిల్లాకు వచ్చిన కొండపల్లి శ్రీనివాస్‌కు జిల్లా అధికారులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం భోగాపురం మండలం రాజాపులోవ వద్ద టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యాన నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్, కర్రోతు సత్యనారాయణ, కంది చంద్రశేఖర్.. శ్రీనివాస్‌కు గజమాల వేసి, ఘనంగా సత్కరించి, స్వాగతించారు. అనంతరం నగరానికి చేరుకున్న మంత్రి శ్రీనివాస్ సతీసమేతంగా పైడితల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజానంతరం అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ కార్తీక్.. మంత్రికి పుష్పగుచ్చంతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్ బంగ్లాకు చేరుకున్న మంత్రిని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సన్మానించారు. ● గంట్యాడలో మంత్రి శ్రీనివాస్ దంపతులకు గ్రామస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత ఎల్లమాంబను దర్శించుకుని పూజలను నిర్వహించారు. అనంతరం స్వగృహానికి చేరుకొని కీర్తిశేషులు కొండపల్లి పైడితల్లినాయుడు దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ● గజపతినగరంలో మంత్రి శ్రీనివాస్‌కు ఘనస్వాగతం లభించింది. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు టిడిపి కార్యాలయానికి నాలుగు మండలాల నాయకులు తరలివచ్చారు. మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, నాయకులు గోపాలరాజు, ప్రదీప్ కుమార్, తదితరులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి కొండపల్లికి అభినందనల వెల్లువ



మంత్రి శ్రీనివాస్‌కి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరంకోట : మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. జిల్లా పరిషత్తు అతిథి గృహంలో ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది, నాయకులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.. మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టుల స్థితిగతులు, అమలవుతున్న పథకాలు తదితర అంశాలను మంత్రికి కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, డిపిఆర్ఒ డి.రమేష్, తదితరులు భాకాంక్షలు తెలిపారు.

కేక్ కట్ చేసిన మంత్రి

డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జెడ్‌పి అతిథి గృహంలో సెర్ప్ ఉద్యోగులు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, ఎపిడి సావిత్రి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఆదియ్య, డిపిఎంలు, తదితర సిబ్బంది మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.



ఫుడ్‌కోర్టుకు కేటాయించిన భూములు

ఫుడ్‌కోర్టు భూముల వ్యవహారంలో
దిద్దుబాటు చర్యలు

- ఫ్రీహోల్డ్ చేసిన డి-పట్టా భూములు రిజిస్ట్రేషన్లు కాకుండా ఆదేశాలు
- పట్టాలు రద్దు చేసేందుకూ ప్రయత్నాలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూ పరిధిలోని ఫుడ్‌కోర్టుకు కేటాయించిన భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా ఫ్రీహోల్డ్ చేసిన డి-పట్టా భూములను రిజిస్ట్రేషన్లు చేయకుండా చూడాలని రెవెన్యూ అధికారులు స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశించినట్లు సమాచారం. ఫ్రీహోల్డ్ పట్టాలను రద్దు చేసేందుకు కూడా రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

బసవపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 25లో ఫుడ్ కోర్టు కోసం 70 ఎకరాలను 2019లో అప్పటి ప్రభుత్వం ఎపిఐఐసి ద్వారా కేటాయించిన విషయం తెలిసిందే. ఇందులో 18 ఎకరాలు ప్రభుత్వ భూమి. మిగతా 52 ఎకరాలు డి-పట్టాలు ఉన్న రైతులవి. ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలనుకున్న ప్రయివేటు సంస్థ రైతుల డి-పట్టా భూములకు ఎకరాకు రూ.12.50 లక్షలు చొప్పున ఇచ్చేందుకు అప్పట్లో ధర నిర్ణయించారు. ఈ మేరకు ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున అడ్వాన్సులు కూడా అప్పట్లో చెల్లించారు. ఇటీవల వీరికి కేటాయించిన భూముల్లో ప్రభుత్వ భూమిని ఏకంగా జిఎంఆర్ సంస్థకు విమానాశ్రయ సిఐఎస్ఎఫ్ సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణానికి కేటాయించేశారు. మిగతా 52 ఎకరాల్లోని సుమారు 30 ఎకరాలకు సంబంధించి ఫ్రీ హోల్డ్ పట్టాలు ఇచ్చేశారు. మాజీ సిఎస్ జవహర్ రెడ్డి బినామీలు ఈ భూములను కొనుగోలు చేయడం వల్లే ఫ్రీ హోల్డ్ పట్టాలు ఇచ్చారని ఇటీవల విశాఖ కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో ఫుడ్‌కోర్టు సంస్థ కోర్టును ఆశ్రయించడంతో ఈ వ్యవహారమంతా బయటపడింది.

వెంటనే దిద్దుబాటు చర్యలు

ఫుడ్ కోర్టు సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రెవెన్యూ అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఫ్రీ హోల్డ్ పట్టాలు ఇచ్చిన డి-పట్టా భూముల రిజిస్ట్రేషన్లు జరగకుండా స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు తెలియజేశారు. అంతేకాకుండా ఫ్రీ హోల్డ్ పట్టాలు కూడా రద్దు చేయాలనే ఆలోచనకు కూడా రెవెన్యూ అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది.

చేపల విక్రయాలపై ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆదివారం పలు కూడళ్ల వద్ద చేపలు, చికెన్, మటన్ విక్రయాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. చట్టవిరుద్ధమైన తూనిక రాళ్ళ వినియోగించి వినియోగదారులను మోసగిస్తున్న ముగ్గురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశారు. ఇంకోసారి గానీ ఇటువంటి మోసాలకు పాల్పడితే భారీగా అపరాధ విధిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు హెచ్చరించారు. వినియోగదారులు కూడా మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అందుకోసం నెలలో రెండు చోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తూకంలో, కొలతల్లో ఎక్కడైనా మోసాలు గుర్తిస్తే తమ శాఖకు తెలియజేయాలని కోరారు.



కాజ్‌వేపై వేగావతి నీరు ప్రవహించడంతో ఏర్పడిన బురద ; ఇన్‌సెట్‌లో కాజ్‌వేపై ఏర్పడిన రంధ్రం

వేగావతి ఉధృతి

కొట్టుకుపోతున్న కాజ్‌వే ● వాహనాలను దారి మళ్లించిన పోలీసులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఒడిశాలో వర్షాలతో వేగావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పారాది వంతెన వద్ద నిర్మించిన కాజ్‌వే (డైవర్షన్ రోడ్డు)పై నుంచి వరదనీరు ప్రవహించింది. దీంతో రోడ్డు మధ్యలో ఒక రంధ్రం ఏర్పడగా, మరోచోట రోడ్డు కిందకు జారింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన డిఎస్‌పి శ్రీనివాసరావు నదిని పరిశీలించి ప్రమాదాల నివారణకు వాహనాలను దారి మళ్లించారు. బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను బాడంగి, తెర్లాం, రాజాం మీదుగా పంపించారు. రామభద్రపురం నుంచి బొబ్బిలి వచ్చే వాహనాలను అదే రోడ్డు మీదుగా దారి మళ్లించారు. పారాది వంతెన కుంగి ఏడాదైనా నూతన వంతెన పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన వంతెన పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నాసిరకం పనుల వల్లే : సిపిఎం

నాసిరకం పనులు చేయడం వల్లే పారాది వంతెన వద్ద వేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డును ఆదివారం ఆయన పరిశీలించారు. రూ.లక్షలు ఖర్చు చేసి కాజ్‌వే నిర్మించినా, పనుల్లో నాణ్యత లేకపోవడంతో రోడ్డు కొట్టుకుపోతుందని ఆయన తెలిపారు. రోడ్డుపై రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారాది వంతెన పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం




- వంద శాతం పదో తరగతి ఫలితాలు ధ్యేయంగా ప్రణాళిక
- 'ప్రజాశక్తి'తో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతన విద్యా సంవత్సరంలో మెరుగైన, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అందుకు అనుగుణంగా విద్యా ప్రణాళికను అమలు చేస్తామన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లాలో విద్యా రంగ పరిస్థితిపై, విద్య మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

నూతన విద్యా సంవత్సరానికి ఎలా సన్నద్ధమయ్యారు.?



2024-25 విద్యా సంవత్సరంలో మెరుగైన, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ నెల 13 నుంచి పాఠశాలలు ప్రారంభమ య్యాయి. విద్యార్థులు పాఠశాలల్లో అడుగు పెట్టేటప్పటికీ ఆహ్లాదకరంగా పాఠశాల ఉండేలా జూన్ మొదటి వారం నుంచి పాఠశాలలను ఉపాధ్యాయులు సుందరంగా తయారు చేశారు.

బడిలో పిల్లల్ని చేర్పించేందుకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

విద్యా సంవత్సరంలో బడిబయట పిల్లలు లేకుండా చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'నేను బడికి పోతా' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 13 నుంచి జులై 11 వరకు ఉపాధ్యాయులు, వాలంటీర్ల సహకారంతో ఆ కార్యక్రమాన్ని చేపడతాం.

విద్యార్థి కిట్లు పంపిణీ ఎంతవరకు వచ్చింది.?

ప్రభుత్వ పాఠశాలల్లోని 1,28,189 మంది విద్యార్థులకు విద్యార్థి కిట్లు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. బ్యాగ్, టై, షూ, బెల్ట్, నోట్ పుస్తకాలు వందశాతం వచ్చాయి. ఆయా మండల కేంద్రాలకు, పాఠశాలలకు కిట్లను పంపించాం. యూనిఫాం రావాల్సి ఉంది.

పాఠ్యపుస్తకాలు ఎంతవరకు వచ్చాయి.?

పాఠ్యపుస్తకాలు పదో తరగతి ఫిజికల్ సైన్స్ తప్ప అన్ని వచ్చాయి. అవి కూడా సోమవారం పూర్తి స్థాయిలో వస్తాయి. 9.15 లక్షలు పాఠ్యపుస్తకాలు ప్రతిపాదన పెట్టగా, ఆ మేరకు జిల్లాకు చేరుకున్నాయి.

పదోతరగతి సిలబస్ మార్పుపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

ఈ ఏడాది పదో తరగతి సిలబస్ మారింది. విద్యార్థులు మారిన సిలబస్‌ను అర్థం చేసుకునేలా బోధించడం కోసం మరో రెండు రోజుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తాం.

పదో తరగతి ఫలితాల మెరుగుదలకు ప్రణాళిక ఏమిటి.?

ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపే విధంగా విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్, సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశాం. మండల విద్యా శాఖ, సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో చర్చించి ప్రణాళిక తయారు చేసి దానిని అమలు చేస్తున్నాం. 2023-24లో ఫలితాలు మెరుగయ్యాయి. ఈ ఏడాది వందశాతం ఫలితాలే లక్ష్యంగా పని చేస్తాం.

హైస్కూల్ ప్లస్‌లో ప్రవేశాలు ఎలా ఉన్నాయి.?

ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో ఏడు ప్రభుత్వ హైస్కూళ్లలో ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్నాం. బొండపల్లి, జామి, కోనూరు, రామభద్రపురం, ఎ.వెంకటాపురం, పిరిడి హైస్కూల్లో జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతికి 40 మంది విద్యార్థులకు గాను ఇప్పటికే 60 శాతం వరకు అదే హైస్కూల్లో చదివి పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారిని చేర్పించాం. వీటిలో కొత్త అధ్యాపక పోస్టులు రాలేదు. పాఠశాలలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయుల ద్వారా బోధన కొనసాగుతుంది. స్కూల్ అసిస్టెంట్లలో జూనియర్ కళాశాల అధ్యాపకులుగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఉన్నారు. బోధనకు ఎటువంటి సమస్యా లేదు. విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తల్లిదండ్రులు కూడా విద్యార్థులను చేర్పించాలి.

సిబిఎస్ఇ సిలబస్ బోధన ఎన్ని పాఠశాలల్లో చేపడుతున్నారు.?

జిల్లాలో 63 పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్ బోధిస్తున్నాం. గత ఏడాది నుంచి తరగతులు నిర్వహిస్తున్నాం.

విద్యా ప్రమాణాలు మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు.?

విద్యా ప్రమాణాల మెరుగుదలకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులను అందుకు సన్నద్ధం చేశాం. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యా బోధన చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి. నాణ్యమైన విద్యను అందించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. అందుకు తల్లిదండ్రులు సహకరించాలి.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో ఆర్డినేటర్ కె.వరలక్ష్మి అధ్యక్షతన ఇంటర్నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ డేను స్థానిక యూత్ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో అత్యధికంగా ఉన్న గృహ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని, ఐఎల్ఒ 189 తీర్మానం ప్రకారం ప్రభుత్వం తక్షణం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చెయ్యాలని కోరారు. గృహ కార్మికులకు సామాజిక భద్రత, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసంఘటితరంగ సంక్షేమ బోర్డులో గృహ కార్మికులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సొసైటీ ఫర్ డెవలప్మెంట్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కలివేల ఎలిషా కుమార్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో వర్కర్స్‌పై జరిగే భౌతిక, లైంగిక దాడులను అరికట్టాలని కోరారు. గృహ కార్మికులకు కనీస వేతనం రూ.12 వేలకు తగ్గకుండా నిర్ణయించాలన్నారు. సమావేశంలో శ్రామిక మహిళా విభాగం కన్వీనర్ జామి దేవి, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సియాధుల పార్వతి, సమాజ చైతన్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చింత జ్యోతి, ఏరియా కోఆర్డినేటర్స్ కింతలి పార్వతి, హసీనా బేగం, బి.పుణ్యవతి, సిహెచ్.చాందిని, బొత్స అప్పలనారాయణ, బి భాను తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నగర అధ్యక్షులు జగన్మోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించి, బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కస్పా పాఠశాలలో ఎస్‌కె బేగం అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2, 3 నెలల బకాయి వేతనాలు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆయాలకు పారితోషికాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్ట్‌టైం వర్కర్స్ అంటూ చెప్పి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయిస్తున్నారని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో స్టడీ అవర్స్ ఉంటే 7 గంటల వరకు ఉండాల్సి వస్తుందన్నారు. నెల వేతనం రూ.6 వేలు సరిపోదని, కనీసం 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యూనిఫాం, గుర్తింపు కార్డులు, క్యాజువల్ సెలవులు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ఎంఇఒకు ఈ నెల 20న వినతి అందించాలని సమావేశంలో నిర్ణయించారు.



శానిటేషన్ కార్మికులతో కలిసి మాట్లాడుతున్న సిఐటియు నగర అధ్యక్షులు జగన్మోహన్

సమావేశంలో యూనియన్ కార్యదర్శి నందిని, సభ్యులు ఉమా, అభిత బేగం, పార్వతి, సత్యవతి, చిన్నతల్లి, లత, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్

జిందాల్ సమ్మెకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ ఆదివారం సంపూర్ణ మద్దతు తెలిపారు. జిందాల్ యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఫెర్రో పరిశ్రమలు పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయన ఆందోళన చేశారు. యాజమాన్యాలు లే ఆఫ్ పేరుతో ఒక్కొక్క ఫ్యాక్టరీకి మూత వేస్తున్నారని, దీనివల్ల కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు జీవితాలతో యాజమాన్యాలు ఆటలాడడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిందాల్ కర్మాగారాన్ని భేషరతుగా లే ఆఫ్ ఎత్తివేసి కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు, జిందాల్ టిఎన్‌టియుసి అధ్యక్షుడు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



నేలకొరిగిన చెట్లు, దెబ్బతిన్న షెడ్డు


ఈదురు గాలులకు నేలకొరిగిన షెడ్లు, చెట్లు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం రాత్రి వీచిన గాలులకు షెడ్లు, చెట్లు నేలకొరిగాయి. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సిబ్బందికి నీడ కొరకు ఏర్పాటు చేసిన షెడ్లు, ఆవరణలో ఉన్న చెట్లు నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కేజీపూడి, బక్కునాయుడుపేట గ్రామాలలో ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు వరిగిపోవడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్తు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సౌకర్యం మెరుగుపరచడానికి సిబ్బంది నిర్విరామంగా కృషి చేశారు.

విద్యుత్ శాఖకు రూ.15 లక్షల ఆస్తి నష్టం

శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రామస్వామిపేట, చినగుడిపాల, పేదగుడిపాల, వేపాడ గ్రామాలలో 15 విద్యుత్ స్తంభాలు నేల కూలిపోయాయి. దీంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు పునరుద్ధరణ పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. జగ్గయ్యపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఈ ఈదురు గాలుల కారణంగా విద్యుత్తు శాఖకు సుమారు రూ. 15లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఎలక్ట్రికల్ అధికారులు అంచనా వేస్తున్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు రామ్ మల్లిక్

ప్రతిఒక్కరికీ నాణ్యమైన విత్తనాలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో ప్రతి ఒక్క రైతుకీ నాణ్యమైన వరి విత్తనాలను రాయితీపై అందించటమే ప్రభుత్వ ఉద్దేశ్యమని టిడిపి రాష్ట్ర యువ నాయకులు కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని గర్భాం సచివాలయం-2 పరిధిలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఈ మండలం నుంచి టిడిపికి అధిక మెజారిటీ తెచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మండలానికి సాగు నీరు తెచ్చేందుకు ఇప్పటి నుంచే కృషి చేస్తున్నామని, మునుముందు ప్రజా ప్రతినిధుల ఆకాంక్ష మేరకు మండలాన్ని అందరు సహాయ సహకారులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, మాజీ ఎంపిపి కోట్ల మోతిలాల్ నాయుడు, రెడ్డి వరం, మండల రమణ, మోహనరావు, పిన్నింటి సన్యాసి నాయుడు, శివ డాక్టర్, చీపురుపల్లి ఏడి కోటేశ్వరరావు, ఎఒ శ్రావణి తేజ, గర్భాం సర్పంచ్ గాబ్రియేల్, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం ఎస్ఐగా కళాధర్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా జి కళాధర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ ఐ ఎస్ కే ఫక్రుద్దీన్ మెడికల్ లీవ్ లో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి కళాధర్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలకుండా ఉండేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.

నేరాలు ఘోరాలు

తాటిపూడి జలాశయంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌లో పడి ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న విఆర్ఒ గంట్యాడ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు చోడవరం గ్రామానికి చెందిన జలగొడుగుల నాగేశ్వరరావుగా గుర్తించారు. మృతుని భార్య వరలక్ష్మి కథనం ప్రకారం.. వేసవి సెలవులకు తాము ఎస్‌కోటలోని ఇంటికి వచ్చామని శుక్రవారం తన భర్త తాటిపూడి జలాశయం చూడడానికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో అంతా గాలించామని చెప్పారు. దీంతో ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మృతి చెందిన వ్యక్తి తన భర్త అని వరలక్ష్మి గంట్యాడ పోలీసులకు తెలియజేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ నాయుడు తెలిపారు.


తాటిపూడి జలాశయంలో తేలాడుతున్న నాగేశ్వరరావు మృతదేహం

అమ్మో వసతి గృహం

- శిథిలావస్థలో భోగాపురం బాలుర హాస్టల్
- గదుల్లో రాలిపడుతున్న శ్లాబు పెచ్చులు
- భయం భయంగా గడుపుతున్న విద్యార్థులు
- పాఠశాలలో చేరేందుకు వెనుకడుగు
- మరమ్మత్తులకూ మంజూరు కాని నిధులు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం మండల కేంద్రంలోని బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా భయాందోళనలకు గురవుతున్నారు. ఇటు అధికారులు, అటు ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు వసతి గృహాన్ని చూసి చేరేందుకు భయపడుతున్నారు. ఇప్పటికే చేరిన విద్యార్థులు కూడా శిథిల వసతి గృహంలో ఉండేందుకు భయడపడుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో రాత్రి పూట నిద్ర కూడా పట్టడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

మండలంలో గతంలో నాలుగ వసతి గృహాలుండేవి. ఇందులో బాలికల బిసి వసతిగృహం తీరప్రాంతమైన ముక్కాంలో ఉండగా, గతేడాది మధ్యలోనే బాలికలు మానేయడంతో ఇది మూతబడింది. మరో మూడు వసతి గృహాలు మండల కేంద్రంలో ఉండేవి. ఇందులో ఎస్‌సి బాలికల వసతిగృహం మూసివేశారు. అనంతరం ఎస్‌సి బాలుర వసతిగృహాన్ని కూడా మూసేశారు. చివరకు బిసి బాలుర వసతిగృహం ఒక్కటే మిగిలింది. ఇది కూడా శిథిలావ్థకు చేరుకోవడంతో పాత ఎస్‌సి బాలికల వసతి గృహంలోకి విద్యార్థులను మార్చారు. ఇప్పుడు ఇది కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


పెచ్చులూడిన భవనం పైకప్పు భాగం

35 ఏళ్ళ కిందట నిర్మించడంతో శిథిలావస్థకు

ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్న వసతిగృహం నిర్మించి సుమారు 35 సంవత్సరాలు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో సుమారు 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు నివాసం ఉండే గదుల్లో శ్లాబు పెచ్చులు రాలి పడిపోతున్నాయి. వర్షం వస్తే చాలు గదులన్ని వర్షపు నీటితో కారిపోతున్నాయి. ఇక డైనింగ్ హాల్ పూర్తిగా శ్లాబు పెచ్చులు పడిపోవడంతో దానిని పూర్తిగా వాడకుండా వదిలేశారు. వసతిగృహంపై ఉన్న పిట్టగోడ సైతం పగుళ్ళు రావడంతో అది కూడా కూలిపోయే పరిస్థితి ఉంది. ఇలాంటి సమస్యలు నడుమ విద్యార్థులు భయంభయంగా గడుపుతున్నారు.


శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహం

కనీస మరమ్మత్తులు కూడా చేయని అధికారులు


లోపలి భాగంలో కిటికీ వద్ద పెచ్చులూడిపోయిన గోడ

వసతిగృహం మరమ్మత్తులు చేసేందుకు కూడా అధికారులు కనీసం ముందుకు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లగా మరమ్మత్తు పనులు చేయాలని వసతిగృహ వార్డెన్‌లు కోరినప్పటికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి కూడా స్థానిక అధికారులు తీసుకు వెళ్ళారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుత ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టి సారించి కనీస మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

- నూతన ప్రభుత్వ ఏర్పాటు సందర్భంగా మండల సమావేశంలో మరోసారి తీర్మానం
- ప్రోటోకాల్ తప్పితే ఊరుకునేది లేదు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- ఇంటర్ ప్రవేశాలపై చర్చ

ప్రజాశక్తి - జామి

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా స్టీల్ ప్లాంట్ ప్రైయివేటీకరణ ఆపాలని జామి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆదివారం మండల పరిషత్ సమావేశం భవనంలో ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా, జెడ్‌పిటిసి సరయు అతిధులుగా పాల్గొన్నారు. విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ రద్దుకు నూతన ప్రభుత్వం కృషి చేయాలని, ఇప్పటికే గతంలో తీర్మానం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. అనంతరం జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జిల్లా పెద్దలు చేసిన కృషిని అభినందిస్తూ తీర్మాణం చేశారు. అయితే ఇటీవల జామి హైస్కూల్ హెచ్‌ఎం, ప్రజాప్రతినిధులు కాకుండా రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని పెట్టి, ప్రోటోకాల్ తప్పిన అంశాన్ని సభ దృష్టికి తీసుకురాగా, ఎంఇఒ జయశ్రీ వివరణ ఇచ్చారు. ఇంటర్ జాయినింగుల కోసం అందరి సహకారం తీసుకుని అధికారులు పని చేయాలని, కానీ ఏకపక్షంగా వ్యవరించడం సరికాదన్నారు. ప్రోటోకాల్ తప్పితే, ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామంలో సర్పంచుల ప్రోటోకాల్ పాటించకుండా వ్యవసాయ అధికారులు వ్యవహారించారని సభ దృష్టికి తీసుకొచ్చారు. హైవే నిర్మాణం వల్ల ఏర్పాటు చేసిన కల్వర్టుల్లో నీరు నిలిచి పోవడంతో వ్యవసాయ పనులకు ఇబ్బంది కలుగుతుందని, తహశీల్దార్ వెంటనే హైవే ప్రతినిధులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా, చెరువుల్లో మట్టి తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను కోరారు. విత్తనాలు, ఎరువులు పంపిణీ అంశం పై చర్చ చేపట్టిన సభ్యులు, సక్రమంగా రైతులకు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ, వైస్ ఎంపిపిలు విజయలక్ష్మి, వెంకటరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.


ప్రోటోకాల్ పై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం

ఘనంగా స్వాగత ఏర్పాట్లు

ప్రజాశక్తి- భోగాపురం

కేంద్ర రాష్ట్ర మంత్రులకు పోలిపల్లి వద్ద సోమవారం స్వాగతం పలికేందుకు టిడిపి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు మంత్రి పదవి చేపట్టాక మొట్టమొదటిసారి సొంత జిల్లా శ్రీకాకుళం వెళున్నారు. దీనిలో భాగంగా పోలిపల్లి సమీపంలో గతంలో యువగళం సమావేశం జరిగిన భూమాత లేఔట్ లో వారికి స్వాగతం పలకనున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు.


హోమం చేస్తున్న గొంప వెంకటరావు దంపతులు

శివాలయంలో హోమం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది శివాలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు గొంప వెంకటరావు, తులసి దంపతులు, గళ్ళ రామచంద్ర మాస్టర్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హోమం నిర్వహించారు. పురోహితుడు దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. వార్సికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెంకటరావు తెలిపారు.


ర్యాలీ చేస్తున్న ధ్యాన కేంద్రం సభ్యులు

శాఖాహార సద్భావన ర్యాలీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని వినాయక పల్లిలో ఆదివారం శాఖాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. శ్రీ వినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు మీ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కార్యక్రమాన్ని గ్రామంలో గల పురవీధుల్లో మాంసాహారాన్ని విడనాడాలని పిలుపునిస్తూ నినాదాలు చేస్తూ సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాంసాహారాన్ని త్యజించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. బ్రహ్మర్షి పత్రీజీ అడుగుజాడల్లో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు శాఖాహారులు పాల్గొన్నారు.

జీవరాశికి రక్షణనిచ్చేది చెట్టు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఫాదర్స్‌డే సందర్భంగా గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదఖండేపల్లి రహదారిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని సిమ్ ఉప కన్వీనర్ వి.నాగేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ కుటుంబానికి తండ్రి రక్షణనిచ్చే గొడుగు వంటివాడని, ఈ భూమిపైన జీవరాశికి రక్షణనిచ్చేది చెట్టేనని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా చెట్లు పెంచాలన్నారు. సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, కృష్ణవేణి, బి.హృషీకేశ్, లాస్యశ్రీ, పార్థ, ప్రజ్ఞ, ఇంటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న నిర్వాహకులు

అక్రమాలకు అడ్డుకట్టు లేదా..?

- నగర పంచాయతీలో పెచ్చుమీరుతున్న అక్రమాలు
- అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా కట్టడాలు

నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాలు జోరుగా అక్రమాలకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనుమతి లేని భవన నిర్మాణాలు అడ్డుకునే వారు లేరా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. పటిష్ఠ మైన సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత కూడా నగర పంచాయతీలో అక్రమాలు పెరిగిపోయాయని చర్చ జరుగు తుంది. సమస్యలు, అక్రమాలపై ఫిర్యాదు చేస్తే సదరు ఫిర్యాదు తీసుకున్న వారు నేరుగా అక్రమార్కులకు సమాచా రమిచ్చి మీరు మీరు చూసుకొండని తప్పించుకుంటున్నారు. నగర పంచాయతీ కార్యాలయం కూడా అదృశ్య శక్తుల చేతిలో నడుస్తుందని నాయకులు, అధికారులు కూడా ఉత్సవ విగ్రహాల మాదిరి వ్యవహరిస్తున్నారని పలు విమర్శలు వినవస్తున్నాయి.



మొయిద జంక్షన్‌లోని సినిమా హాలు పక్కనే నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవల మొయిద జంక్షన్ సచివాలయ పరిదిలో థామస్ పేటలో కోర్టులో కేసు నడుస్తుండగా ఇంటి నిర్మాణం చేపట్టడంపై ఫిర్యాదులు చేసినప్పటికీ నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కంటి తుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదే సచివాలయ పరిధిలో సినిమ హాల్ ప్రాంగణంలో రహదారి భవనాల శాఖ స్థలంలో అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణం చేస్తున్నా నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కోర్టులో కేసు వేయడం తప్పితే అక్రమ నిర్మాణాన్ని నిలువరించ లేకపోయారని స్థానికులు చర్చించు కుంటున్నారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఏడంతస్తుల భవనాన్ని ఇక్కడ నిర్మించి అధికారులకే అక్రమార్కులు సవాల్ విసిరారు. కాగా రామతీర్థం జంక్షన్ సమీపం సర్వే నంబర్ 90లో మెట్ట ఉండగా దాన్ని అక్రమార్కులు రాయి, గ్రావెల్ అమ్ముకోవడమే కాకుండా మెట్టను ఆక్రమించుకొని నిర్మాణాలు కూడా జరుపుతున్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

తెరపైకి నకిలీ పట్టాల వివాదం

ఎక్కడికక్కడ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నకిలీ పట్టాలను సృష్టించి విక్రయించడంతో ఇటీవల నకిలీ పట్టాల వివాదం తెరపైకి వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాలు ఒక పక్క ఆక్రమణలు జరుగుతుండగా నకిలీ పట్టాలు వివాదాలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో రెవెన్యూ గాని, నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కూడా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికార్లు కళ్ళు తెరిచి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


సమస్యను ఎమ్మెల్యే నాగ మాధవికి వివరిస్తున్న గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ

సమస్యలుంటే చెప్పండి

- గరికిపేట నాయకులతో ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి- భోగాపురం

గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే వెంటనే తనకు చెబితే పరిష్కరిస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం తన స్వగృహంలో నెల్లిమర్ల మండలం గరికిపేట గ్రామానికి చెందిన టిడిపి, జనసేన నాయకులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గరికిపేట గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల్లో టిడిపి నాయకులు చాలా కష్టపడి గతం కంటే ఎక్కువ మెజార్టీ సాధించారని ఆ గ్రామాన్ని తాను గుర్తించుకుంటానని చెప్పారు. గ్రామంలో యువత జాబితాను సిద్ధం చేసి తనకు ఇస్తే ఉద్యోగవకాశాలు కల్పిస్తామని మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణకు సూచించారు. అనంతరం ఆమెను నాయకులు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతపల్లి అప్పలనాయుడు, టిడిపి నాయకులు బెల్లాన అచ్చంనాయుడు, మహంతి రాజారావు, మహంతి శ్రీను, పతివాడ రమణ, వార్డు మెంబర్లు బెల్లాన బంగారునాయుడు, తిమనాని ఆదినారాయణ, బెల్లాన ఆదినారాయణ, నాయకులు మహంతి నాగభూషణరావు, బెల్లాన త్రినాద్, బెల్లాన మోహన్, జనసేన నాయకులు బెల్లాన స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సర్పంచుల మద్దతు

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జి రాంబాబు

ప్రజాశక్తి - రామభద్రపురం



రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ సర్పంచులు పూర్తి మద్దతు తెలుపుతున్నామని పంచాయతీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, నిధుల లేమితో గ్రామ పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో అపార అనుభవసాలైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం కొత్త పుంతలు తొక్కి అభివృద్ధి, సంక్షేమం పూర్తి స్థాయిలో జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీలకు మారు పేరైన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు పంచాయతీరాజ్ శాఖ అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపట్ల అవగాహనా, నిబద్ధత ఉన్న పవన్ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఇకనైనా పంచాయతీ వ్యవస్థ గాడిలో పడే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి ప్రతినిదులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ సమస్యలు వివరిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు ఇతర మౌళిక సౌకర్యాలు కల్పించి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యంవైపు అడుగులు వేయాలన్నారు. అటవీ, పర్యావరణ కాలుష్యం పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేసి గ్రామ పంచాయతీలను కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.